క్లుప్తంగా

మండలి చైర్మన్ మోషేన్‌రాజును కలిసిన తహసీల్దార్



మండలి చైర్మన్ మోషేన్‌రాజుతో తహసీల్దార్ రాంబాబు

భీమవరం: నూతనంగా విధులలో చేరిన భీమవరం తహసీల్దార్ రాంబాబు శాసన మండలి చైర్మన్ కొయ్యే మోషేన్‌రాజును గురువారం సాయంత్రం మర్యాద పూర్వకంగా కలిశారు. ఐపీఎస్‌కు ఎంపికైన కొయ్యే చిట్టిరాజుకు ఈ సందర్భంగా భీమవరం క్యాంప్ కార్యాలయంలో ఆయన అభినందనలు తెలిపారు.

ఏకగ్రీవంగా పాఠశాల కమిటీలు

వీరవాసరం: మండలంలోని ప్రభుత్వ పాఠశాలల్లో పాఠశాల కమిటీలు అన్ని పాఠశాలల్లోనూ ఏకగ్రీవమయ్యాయని మండల విద్యాశాఖ అధికారి శివన్నారాయణ గురువారం తెలిపారు. 61 ప్రాథమిక పాఠశాలలు, ఒక అప్పర్ ప్రైమరీ పాఠశాల, 7 హైస్కూల్‌లకు పాఠశాల కమిటీలు ఏర్పాటు చేయడం జరిగిందన్నారు. కమిటీల ఏకగ్రీవ ఎన్నికకు ప్రజా ప్రతినిధులు, పాఠశాల విద్యార్థుల తల్లిదండ్రులు పూర్తిస్థాయి సహకారం అందజేశారని వివరించారు.

టీ-స్పర్ష్ షోరూమ్ ప్రారంభం



టీ-స్పర్ష్ షోరూమ్‌ను ప్రారంభిస్తున్న దృశ్యం

భీమవరం: పట్టణంలోని ఉండి రోడ్డులో నూతనంగా ఏర్పాటు చేసిన టీ-స్పర్ష్ షోరూమ్‌ను గురువారం ప్రారంభించారు. స్థానిక ఎమ్మెల్యే పులపర్తి రామాంజనేయులు చేతులమీదుగా ఈ కార్యక్రమం చేపట్టారు. ఈ సందర్భంగా టయోటా ఏరియా మేనేజర్ శశికాంత్ మాట్లాడుతూ టయోటా అర్బన్ క్రూజర్ టైజర్ వాహన శ్రేణిని అందుబాటులోకి తీసుకువచ్చామన్నారు. వాహనాల బుకింగ్స్‌తో పాటు డెలివరీ కూడా ఇక్కడే ఇస్తామన్నారు. వాహనాల టెస్ట్ డ్రైవ్ కూడా ఏర్పాటు చేసినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో సౌత్‌జోన్ హెడ్ మహారాజా, ఏపీ హెడ్ నిఖిల్, పృథ్వీ టయోటా చైర్మన్ మాలెంపాటి రమేష్‌బాబు, డైరక్టర్ పృథ్వీ చంద్ర, సీఈఓ కిరణ్ కుమార్, సిబ్బంది పాల్గొన్నారు.

విద్యార్థులు డ్రగ్స్ రహిత సమాజం కోసం పాటుపడాలి



సమావేశంలో మాట్లాడుతున్న ప్రసన్నకుమార్

భీమవరం: విద్యార్థులు డ్రగ్స్ రహిత సమాజం కోసం పాటుపడాలని భీమవరం బార్ అసోసియేషన్ కార్యదర్శి అడబాల ప్రసన్నకుమార్ అన్నారు. భీమవరం పట్టణంలోని ఆర్ఆర్‌డీఎస్ ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో గురువారం నిర్వహించిన కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. విద్యార్థులు డ్రగ్స్, ఇతర మాదకద్రవ్యాల వినియోగానికి దూరంగా ఉండడంతోపాటు వాటివల్ల ఏర్పడే నష్టాలను సమాజంలో అవగాహన కల్పించాలన్నారు. ఈ కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్ వికేజే ప్రసూన, న్యాయవాది తాళ్లూరి మధు, అధ్యాపకులు పి అమూల్యారావు, ధనుంజయ్, రాజశేఖర్ తదితరులు పాల్గొన్నారు.

మిషన్ శక్తిపై అవగాహన సదస్సు

పాలకోడేరు: మిషన్ శక్తి 100 రోజుల అవగాహన కార్యక్రమంలో భాగంగా గురువారం శృంగవృక్షం అంగన్‌వాడీ సెంటర్‌లో లబ్ధిదారులకు, మహిళలకు ఐసీడీఎస్ సూపర్‌వైజర్ సీహెచ్ పార్వతి ఆధ్వర్యంలో అవగాహన సదస్సు నిర్వహించారు.

కొబ్బరి చెక్కల వేలం

భీమవరం(ప్రకాశం చౌక్): గునుపూడిలో వేంచేసియున్న పంచారామక్షేత్రం శ్రీ సోమేశ్వర జనార్దన స్వామి వార్ల దేవస్థానం నందు కొబ్బరి చెక్కలు పోగు చేసుకొను లైసెన్స్‌కు గురువారం వేలం నిర్వహించారు. ఈ సందర్భంగా దేవస్థాన కార్య నిర్వహణ అధికారి డి.రామకృష్ణంరాజు మాట్లాడుతూ వివరాలు తెలిపారు. ఈ వేలంలో పట్టణానికి చెందిన కొప్పర్తి మహేష్ బాబు మొదటి ఏడాదికి రూ.8,47,000, రెండో ఏడాదికి రూ.9,31,700 వేలం లైసెన్స్ పొందారని తెలిపారు. గత ఏడాది కంటే ఈ ఏడాది రూ.27,000 ఆదాయం పెరిగిందని తెలిపారు. దేవస్థానం బయట కొబ్బరికాయలు వగైరాలు విక్రయించుకొను లైసెన్సు నెలకు రూ.12,000లకు వేలంలో పట్టణానికి చెందిన యర్రంశెట్టి ఆంజనేయులు లైసెన్స్ పొందన్నారు. గతంలో నెలకు రూ.8,000 ఉండగా ప్రస్తుతం రూ.4,000 పెరిగిందన్నారు. రామలింగేశ్వరస్వామి వారి దేవస్థానం ఈవో డీవీ కృష్ణంరాజు, ఆలయ అధికారులు పాల్గొన్నారు.

రైతుల గోడు.. బకాయి చూడు

ధాన్యం సొమ్ముకోసం అన్నదాత ఎదురుచూపు

- పూర్తి కావస్తున్న లెవీ ప్రొక్యూర్
- అయినా రైతుకందని నగదు



ఏప్రిల్‌లో ఆరబెట్టి, పట్టుబడి పట్టిన ధాన్యం (ఫైల్)

ఆకివీడు: ధాన్యం సొమ్ములందక రైతన్న గగ్గోలు పెడుతున్నాడు. దీంతో రైతుల గోడు పట్టించుకునే నాథుడు కరువయ్యాడు. రైతుల దయనీయ స్థితి మళ్లీ మొదటికి వస్తుంది. ఆరుగాలం శ్రమించి పండించిన పంట సొమ్ము చేతికి అందక అన్నదాతలు ఆందోళనకు గురవుతున్నారు. ప్రకృతి వైపరీత్యాలను తట్టుకుంటూ గింజ గింజనూ రక్షించుకుంటూ వస్తున్న రైతన్నలకు గుప్పెడు మెతుకులు దొరకడం కష్టతరంగా మారుతుంది. పండిన పంట తాలూకూ సొమ్ము అందకపోవడంతో రైతుల ఆర్థిక పరిస్థితిపై తీవ్ర ప్రభావం చూపుతుంది. నియోజకవర్గంలోని సుమారు 22 వేల ఎకరాల్లో రబీ సాగు చేశారు. ఏప్రిల్, మేలలో ముమ్మరంగా మాసూళ్లు చేసి ధాన్యం పట్టుబడులు పట్టారు. కొనుగోలు కేంద్రాల ద్వారా విక్రయించిన ధాన్యం ఆయా రైస్ మిల్లులకు చేర వేశారు. ఏప్రిల్‌లో ధాన్యం విక్రయించిన రైతులకు సకాలంలో సొమ్ము ఆయా రైతుల ఖాతాల్లో జమ చేశారు. మే నెలలో విక్రయించిన ధాన్యం సొమ్ము మూడు, నాలుగు నెలలు కావస్తున్నా రైతుల ఖాతాల్లో జమ కాలేదు. దీంతో రైతులు తీవ్ర నిరుత్సాహంతో, ఆర్థిక ఇబ్బందులతో తల్లడిల్లుతున్నారు.

ఇంటి అవసరాలూ తీర్చలేక...

రైతులు పండించిన పంట తాలూకూ సొమ్ము ఇంటికి చేరిన తరువాత కుటుంబంతో ఆనందంగా ఇంటి అవసరాలు తీర్చుకోవడం ఆనవాయితీ. ప్రతీ ఏటా వేసవిలో రైతు కుటుంబాలు నూతన దుస్తులు కొనుగోలు చేయడం, ఇంట్లో అవసరమయ్యే నిత్యవసర సరుకులు కొనుగోలు చేయడం వంటివి చేస్తుంటారు. వీటితోపాటు పెద్ద కమతాలు చేసే రైతులు బంగారు, వెండి ఆభరణాలు కూడా కొనుగోలు చేస్తుంటారు. గత ఐదేళ్లుగా రైతుల ఆర్థిక పరిపుష్టి బాగుండటంతో ఇల్లంతా ఆనందంగా, కుటుంబం అంతా సంతోషంగా గడుపుతున్న తరుణంలో ఈ ఏడాది సంతోషాలకు బ్రేక్ వేసినట్లయిందని పలువురు రైతులు వాపోతున్నారు.

ఖరీఫ్ సాగుకు పెట్టుబడి లేదు

ఖరీఫ్ సాగుకు ప్రభుత్వం పెట్టుబడి సహాయం పెంచలేదు. గత ప్రభుత్వం ఇచ్చే రైతు భరోసా సొమ్మును రూ.20 వేలకు పెంచి ఇస్తానని ప్రకటించి, ఉన్న పథకాన్ని కూడా అమలు చేయలేదని రైతులు వాపోతున్నారు. ఖరీఫ్ పెట్టుబడుల కోసం వడ్డీ వ్యాపారస్తులను ఆశ్రయించాల్సి వస్తుందని ఆవేదన చెందుతున్నారు. అప్పోసప్పో చేసి నారుమడులు వేస్తే ప్రకృతి విలయతాండవంతో నారు ఊడ్చుకుపోయింది. మళ్లీ నారు వేయడం, కొనుగోలు చేయడంతో రైతుకు అదనపు భారం పడింది. ఆగస్టు రెండో వారం వస్తున్నా నియోజకవర్గంలో పలుచోట్ల నాట్లు వేయలేని స్థితిలో రైతులున్నారు.

కౌలు పరిస్థితి మరీ దీనం

కౌలు రైతుల పరిస్థితి మరీ దీనంగా ఉంది. గత రబీ కట్టుబడులు ఇవ్వాలని ఒక ప్రక్క భూమి యజమానుల ఒత్తిడి, మరో పక్క పెట్టుబడుల కోసం వెతుకులాటతో కౌలు రైతులు సతమతమవుతున్నారు. కౌలు రైతులకు సహకార సంఘాలు కూడా రుణాలు ఇవ్వకపోవడం, రైతు భరోసా లభించకపోవడంతో పూర్తిగా వడ్డీ వ్యాపారులపై ఆధారపడాల్సి వచ్చింది. గత రబీలో ధాన్యం కొనుగోలు కేంద్రాల ద్వారా విక్రయించిన ధాన్యం సొమ్ము అధిక శాతం కౌలు రైతులకు జమ కాలేదు. గత ప్రభుత్వ హయాంలో రైతు భరోసా సొమ్ముతో సాగు ప్రారంభించేవారు. ఈ ఏడాది ఖరీఫ్‌కు ఆ పరిస్థితి లేదు.

లెవీ ప్రొక్యూర్ పూర్తవుతుంది

కొనుగోలు చేసిన ధాన్యం రైస్ మిల్లర్ల ద్వారా భారత ఆహార సంస్థకు బియ్యం చెల్లింపులు దాదాపుగా పూర్తి కావస్తున్నాయి. నియోజకవర్గంలో సుమారు 9 వేల టన్నుల బియ్యం మాత్రమే ఆయా రైస్ మిల్లర్లు చెల్లించాల్సి ఉంది. ఇప్పటికే కస్టం మిల్లింగ్ రైస్ (సీఎమ్మార్) 80 శాతం బియ్యం ఆయా రైస్ మిల్లర్లు ఎఫ్‌సీఐకి చెల్లించారు. బియ్యానికి సంబంధించి కేంద్ర ప్రభుత్వం ఆయా కన్‌సైన్‌మెంట్‌లకు రెండు మూడు రోజుల్లోనే సొమ్ము చెల్లిస్తుంది. భారత ఆహార సంస్థ నుంచి బియ్యం సొమ్ము తిరిగి వచ్చినప్పటికీ రైతులకు ధాన్యం బిల్లులు చెల్లించకపోవడంపై సర్వత్రా రైతాంగం ఆందోళన వ్యక్తం చేస్తుంది.

నియోజకవర్గంలో ధాన్యం సొమ్ము రావలసిన వివరాలు:

ఆకివీడు	559	8,39,78,263.60
ఉండి	1065	11,44,66,434.00
కాళ్ల	947	8,62,57,703.00
పాలకోడేరు	1257	21,46,12,000.00
మొత్తం	3,828	49,93,14,400.60

రైతులను ఇబ్బంది పెడుతున్నారు



రైతులను కావాలనే ప్రభుత్వం ఇబ్బంది పెడుతుంది. గత ప్రభుత్వ హయాంలో ధాన్యం కొనుగోలు చేసిన 20, నెల రోజుల్లోనే సొమ్ము ఆయా రైతుల ఎకౌంట్‌లో జమయ్యేది. ప్రస్తుతం 4 నెలలు కావస్తున్నా ధాన్యం సొమ్ము ఇవ్వకపోతే ఖరీఫ్ సాగు ఏ విధంగా చేపట్టాలి. తక్షణం బకాయి సొమ్మును రైతుల ఖాతాల్లో జమ చేయాలి

– కిల్లి రామకృష్ణ, రైతు, సిద్ధాపురం, ఆకివీడు మండలం

ఏమి తినాలి, ఏమి కొనాలి ?



ధాన్యం సొమ్ము జమ చేయకపోవడం దారుణం. మూడు నెలలు గడిచినా ప్రభుత్వం పట్టించుకోలేదంటే రైతుపై దయలేదా? ఆరు ఎకరాలు కౌలుకు సాగు చేస్తున్నాను. కట్టుబడుల కోసం రైతు ఒత్తిడి, తక్షణం ఖరీఫ్ పెట్టుబడుల కోసం అవస్థలు, ఇంటి అవసరాలు కూడా తీర్చలేని స్థితిలో ఉన్నాం. ధాన్యం సొమ్ము సుమారు రూ.2.50 లక్షలు రావలసి ఉంది. కౌలు రైతులకు రుణాలు ఇవ్వడం లేదు. అప్పులు పుట్టడం లేదు.

– బుంగా భీమయ్య, కౌలు రైతు, అజ్జమూరు, ఆకివీడు మండలం

వైభవంగా పైడితల్లి విగ్రహ ప్రతిష్ట



మాజీ ఎంపీ గోకరాజు గంగరాజు, సోదరుడు రామరాజుని సత్కరిస్తున్న ఆలయకమిటి సభ్యులు

కాళ్ల: పైడితల్లి అమ్మవారి నామస్మరణతో జువ్వలపాలెం మారుమోగింది. కాళ్ల మండలం జువ్వలపాలెంలోని తూర్పుపేటలో భక్తులు, దాతలు, గ్రామ ప్రజల సహాయ సహకారాలతో నూతనంగా నిర్మించిన గ్రామదేవత పైడితల్లి అమ్మవారి ఆలయంలో విగ్రహం, ఆలయ శిఖర, జీవధ్వజ ప్రతిష్ట మహోత్సవ కార్యక్రమాలు గురువారం అత్యంత వైభవంగా నిర్వహించారు. ఈ సందర్భంగా గ్రామమంతా భక్తి పారవశ్యంతో నిండిపోయింది. ఆలయ ప్రాంగణంలో మంగళవారం ప్రత్యేక హోమాలు నిర్వహించారు. గత మూడు రోజులుగా అమ్మవారి ఆలయ ప్రారంభోత్సవానికి సంబంధించి ప్రత్యేక పూజా కార్యక్రమాలు అత్యంత భక్తి శ్రద్ధలతో నిర్వహించారు. వేద పండితులు బ్రహ్మశ్రీ పుల్లేటికుర్తి గణపతి శర్మ బ్రహ్మోత్సవంలో గురువారం ఉదయం 9:30 నిమిషాలకు వేదమంత్రాల నడుమ అమ్మవారి విగ్రహ ప్రతిష్ఠ చేశారు. నరసాపురం పార్లమెంట్ మాజీ సభ్యుడు గోకరాజు గంగరాజు, టీటీడీ బోర్డు మాజీ సభ్యుడు గోకరాజు రామరాజు, చెన్నమళ్ల చంద్రశేఖర్ పాల్గొన్నారు.

బుద్ధదేవ్ భట్టాచార్య మరణం పట్ల సంతాపం



సీపీఎం కార్యాలయం వద్ద బుద్ధదేవ్ చిత్రపటానికి పూలమాలవేసి నివాళులర్పిస్తున్న దృశ్యం

భీమవరం: బెంగాల్ మాజీ ముఖ్యమంత్రి, సీపీఎం సీనియర్ నేత బుద్ధదేవ్ భట్టాచార్య మరణం పట్ల సీపీఎం జిల్లా కమిటీ ఘనంగా నివాళులర్పించింది. గురువారం మెంటేవారి తోటలోని పార్టీ కార్యాలయం వద్ద బుద్ధదేవ్ భట్టాచార్య చిత్రపటానికి పూలమాలలు వేసి జోహార్లు అర్పించారు. ఈ సందర్భంగా జిల్లా కార్యదర్శి బి బలరామ్ మాట్లాడుతూ పీడిత ప్రజల విముక్తి కోసం పోరాడిన వ్యక్తి బుద్ధదేవ్ బట్టాచార్య అని కొనియాడారు. ఈ కార్యక్రమంలో జెఎన్‌వీ గోపాలన్, ఎం వైకుంఠరావు, ఆంజనేయులు, వడుగు వెంకటేశ్వరరావు, రత్నకుమారి, నాగరాజు తదితరులు పాల్గొన్నారు.

–సీపీఐ ఆధ్వర్యంలో

బుద్ధదేవ్‌భట్టాచార్య మృతి పేదల ప్రజలకు తీరనిలోటని సీపీఐ జిల్లా కార్యదర్శి కోనాల భీమారావు అన్నారు. 11 ఏళ్లపాటు బెంగాల్ ముఖ్యమంత్రిగా ఆరాష్ట్రాభివృద్ధికి ఎనలేని కృషి చేశారన్నారు. బుద్ధదేవ్ మరణం పట్ల సీపీఐ తీవ్ర సంతాపం తెలిపారు.

సైబర్ నేరాల పట్ల అప్రమత్తంగా ఉండాలి



వన్‌టౌన్‌లో సైబర్ నేరాల అవగాహన బ్యానర్స్ ఆవిష్కరిస్తున్న దృశ్యం

భీమవరం: సైబర్ నేరాల నివారణపై ప్రజలంతా అవగాహన కలిగి ఉండాలని భీమవరం వన్‌టౌన్ సీఐ ఆర్ నాగరాజు అన్నారు. గురువారం వన్‌టౌన్ పోలీస్ స్టేషన్‌లో శ్రీవిజ్ఞానవేదిక ఆధ్వర్యంలో సైబర్ నేరాలపై అవగాహన కల్పించడానికి రూపొందించిన ప్లకార్డులు, బ్యానర్ల ప్రచార కార్యక్రమాన్ని సీఐ ప్రారంభించారు. విద్యావంతులు, ఉద్యోగస్తులు వంటివారు కూడా సైబర్ నేరాలకు గురవుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. అపరిచితులకు ఓటీపీ నెంబర్లు, బ్యాంక్ అకౌంట్ వివరాలను ఇవ్వకూడదన్నారు. అవగాహన కార్యక్రమాలకు ప్రభుత్వంతో పాటు స్వచ్ఛంద సంస్థలు ముందుకురావడం అభినందనీయమన్నారు. నిర్వాహకులు చెరుకువాడ రంగసాయి, లయన్స్ క్లబ్ పట్టణ ఉపాధ్యక్షుడు నరహరిశెట్టి కృష్ణ మాట్లాడుతూ సైబర్ నేరాలపట్ల అవగాహన కోసం పట్టణంలోని ప్రధాన కూడళ్లలో బ్యానర్లు, ప్లకార్డ్స్ ప్రదర్శన చేస్తున్నామన్నారు.

లోక్‌అదాలత్‌ను సద్వినియోగం చేసుకోండి



సమావేశంలో మాట్లాడుతున్న జడ్జి సత్యవతి

భీమవరం: సెప్టెంబర్ 14వ తేదీన నిర్వహించే జాతీయ లోక్‌అదాలత్‌లో సివిల్ కేసులు ఎక్కువగా రాజీ చేయడానికి ప్రయత్నం చేయాలని భీమవరం మండల న్యాయ సేవా సంస్థ చైర్‌పర్సన్, మూడవ అదనపు జిల్లా జడ్జి డి సత్యవతి అన్నారు. గురువారం జాతీయ లోక్‌అదాలత్‌కు సంబంధించి న్యాయవాదులతో ఏర్పాటు చేసిన సమావేశంలో జడ్జి సత్యవతి మాట్లాడారు. కేసులను రాజీచేయడానికి కక్షిదారులతో మాట్లాడాలన్నారు. సివిల్ కేసుల్లో ఇప్పటికే చెల్లించిన కోర్టు ఫీజు కూడా వాపసు వస్తుందని కక్షిదారులకు అవగాహన కల్పించాలన్నారు. ఈ సమావేశంలో సివిల్ జడ్జి బి అప్పల స్వామి, ప్రిన్సిపల్ సివిల్ జడ్జి జి సురేష్ బాబు, ఒకటవ అదనపు సివిల్ జడ్జి పి హనీషా, బార్ అసోసియేషన్ అధ్యక్షుడు యేలేటి యోహాన్, ప్రధాన కార్యదర్శి అడపాల ప్రసన్నకుమార్, ఉపాధ్యక్షుడు కె వెంకట్రావు న్యాయవాదులు పాల్గొన్నారు.

నేడు విద్యుత్ సరఫరాకు అంతరాయం

భీమవరం: భీమవరం తహసీల్దార్ ఆఫీస్ ఏరియాలోని 33/11కె.వి ఇండోర్ విద్యుత్ ఉపకేంద్రము పరిధిలో 11 కె వి లైన్ల పై చెట్లు కొమ్మలు తొలగించే నిమిత్తం శుక్రవారం ఉదయం 7 గంటల నుంచి మధ్యాహ్నం 1 గంట వరకు టౌన్ హాల్ ఏరియా,ఎండీఓ ఆఫీస్ ఏరియా, ప్రకాశంచౌక్, పెదపేట, ఏరియాలకు విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్లు విద్యుత్ శాఖ ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్(ఈఈ)పీర్ అహ్మద్ ఖాన్ ఒక ప్రకటనలో తెలిపారు. అదే విధంగా హౌసింగ్ బోర్డ్ కాలనీ ,పి.పి రోడ్, చిన్నరంగని పాలెం ఏరియాల్లో కూడా విద్యుత్ సరఫరా ఉండదని, వినియోగదారులు సహకరించాలని కోరారు.

భీమవరం అర్బన్: మండలంలోని తాడేరు విద్యుత్ ఉపకేంద్ర పరిధిలో శుక్రవారం వార్షిక మరమ్మతుల నిమ్మిత్తం పలు గ్రామాల్లో విద్యుత్ సరఫరాకు అంతరాయం కలుగుతుందని ట్రాన్స్‌కో ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ పీర్ అహ్మద్‌ఖాన్ గురువారం తెలిపారు. పట్టణంలోని వైఎస్సార్ కాలనీ, బ్రిడ్జి పేట, అంబేడ్కర్ సెంటర్, పోతులవారి పేట, గుళ్లంకివారి పేట, ఎంప్లాయిస్ కాలనీ, గరువు పేట, నల్లంవారి తోట, గునుపూడి శివాలయం సెంటర్, సోమగుండం చెరువు ఏరియా, నాచువారి సెంటర్, బేతనిపేట, చినఅప్పారావు తోట, బ్యాంక్ కాలని, రెడ్డి కాలని, చినపేట, సెయింట్ ఆన్స్ స్కూల్ ఏరియాలతో పాటు గ్రామాల్లో తాడేరు, యమునాపల్లి, కొమ్రపాడు, బేతపూడి, కరుకువాడ, యనమదుర్రు, దిరుసుమర్రు హైస్కూల్ ఏరియా, సంతోషపురం గ్రామాలకు ఉదయం 8 నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు విద్యుత్ సరఫరా ఉండదని కావున విద్యుత్ వినియోగదారులు సహకరించాలని కోరారు.

కాళ్ల: మండలం ఎస్సీ బోస్ కాలనీ 33/11 విద్యుత్ సబ్ స్టేషన్ పరిధిలోని 11 కేవీ విద్యుత్ లైన్లు మరమత్తులు, చెట్ల కొమ్మలు తొలగించే పనుల నిమిత్తం శుక్రవారం ఉదయం 8 గంటలు నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు ఎస్సీ బోస్ కాలనీ, పల్లిపాలెం గ్రామాలకు విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్లు ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్ పీర్ అహ్మద్ ఖాన్ గురువారం తెలిపారు. వినియోగదారులు సహకరించాలని కోరారు.

పాలకోడేరు: శుక్రవారం ఉదయం 7 గంటల నుంచి మధ్యాహ్నం 1 వరకు గొరగనమూడి సబ్ స్టేషన్‌లో 11 కేవీ శృంగవృక్షం ఇండస్ట్రియల్ ఫీడర్, బంటుమిల్లి ఫీడర్, మోగల్లు సబ్ స్టేషన్‌లో కోరుకొల్లు ఫీడర్స్ లైన్ మరమ్మతులు, చెట్ల కొమ్మలు తొలగించు నిమిత్తం విద్యుత్ సరఫరా నిలిపి వేయనున్నట్లు భీమవరం ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ అహ్మద్ ఖాన్ తెలిపారు. కావున శృంగవృక్షం, బంటుమిల్లి, పెన్నాడ, కోరుకొల్లు గ్రామాల విద్యుత్ వినియోగదారులు సహకరించాలని ఆయన కోరారు.

తల్లిపాలతోనే బిడ్డకు ఆరోగ్యం



గర్భిణులకు సీమంతాలు చేస్తున్న దృశ్యం

వీరవాసరం: తల్లిపాలతోనే బిడ్డకు సంపూర్ణ ఆరోగ్య లభిస్తుందని ఎంపీపీ వీరవల్లి దుర్గా భవాని తెలిపారు. తల్లిపాల వారోత్సవాల ముగింపు ఉత్సవాలలో భాగంగా స్థానిక ఎండీఓ ఆఫీస్‌లో గురువారం అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో సామూహిక సీమంతాలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంపీపీ వీరవల్లి దుర్గా భవాని మాట్లాడుతూ బ్రెస్ట్ క్యాన్సర్ గురించి తల్లిపాల గురించి వివరించారు. ఈ కార్యక్రమంలో తహసీల్దార్ రామాంజేయులు, సీహెచ్ఓ ఏ. దేవదాసు, వీరవాసరం పీహెచ్‌సీ డాక్టర్ మొహశీనా, ఐసీడీఎస్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులు చెడు వ్యసనాలకు దూరంగా ఉండాలి



సమావేశంలో మాట్లాడుతున్న డీఎన్నార్ ప్రతినిధులు

భీమవరం: విద్యార్థులు చెడు వ్యసనాలకు దూరంగా ఉండాలని భీమవరం డీఎన్నార్ కళాశాల సెక్రటరీ అండ్ కరస్పాండెంట్ గాదిరాజు సత్యనారాయణరాజు(బాబు) అన్నారు. గురువారం కళాశాలలో నిర్వహించిన యాంటీ డ్రగ్ అండ్ టుబాకో కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. విద్యార్థులు విద్యపై దృష్టి పెట్టాలని చెడు అలవాట్లు, స్నేహాలు చేయవద్దని హితవు పలికారు.

విద్యా కమిటీల ఎన్నిక ప్రశాంతం



ఆకివీడు: ఎస్ఎంసీ ఎన్నికల నిర్వహణను పరిశీలిస్తున్న ఎంఈఓ-2 సీతారామయ్య



ఉండి: పాఠశాల పేరెంట్స్ కమిటీ ఎన్నికలు నిర్వహిస్తున్న హెచ్ఎం సత్యనారాయణరాజు

ఆకివీడు: స్కూల్ మేనేజ్‌మెంట్ కమిటీ ఎన్నికలు గురువారం ప్రశాంతంగా నిర్వహించారు. పలు పాఠశాలల్లో విద్యార్థుల తల్లిదండ్రులు, సంరక్షకులు హాజరయ్యారు. కమిటీ చైర్మన్, వైస్‌చైర్మన్‌లను ఎన్నుకున్నారు. వీరిచే ప్రమాణ స్వీకారం చేయించినట్లు ఎంఈవో సీతారామయ్య చెప్పారు.

ఉండి: మండలంలోని 61 ప్రభుత్వ పాఠశాలల్లో యాజమాన్య (పేరెంట్స్) కమిటీ ఎన్నికలు ముగిశాయని మండల రెండో విద్యాశాఖాధికారి వినాయకుడు గురువారం తెలిపారు. రాష్ట్ర ప్రభుత్వ ఉత్తర్వులను అనుసరించి జరిగిన ఆయా పాఠశాలల తల్లిదండ్రులు,ఉపాధ్యాయులు ఆధ్వర్యంలో ఎన్నికలు నిర్వహించినట్లు ఆయన తెలిపారు.

పాందువ్వలో:

మండలంలోని పాందువ్వ ప్రాథమికోన్నత పాఠశాలలో నిర్వహించిన పేరెంట్స్ కమిటీ ఎన్నికల్లో 24 మందిని కమిటీ సభ్యులుగా ఎన్నుకున్నట్లు తెలిపారు. మంతెన సూర్యనారాయణ, చింతలపాటి రాంబాబు, ఉప సర్పంచ్ మధు, తదితరులు పాల్గొన్నారు.

పాలకోడేరు: మండల వ్యాప్తంగా గురువారం స్కూల్ మేనేజ్‌మెంట్ కమిటీ ఎన్నికలు ప్రశాంతంగా ముగిశాయి. 43 ప్రాథమిక పాఠశాలలు 10 జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలు, ఒక ఎయిడెడ్ ఉన్నత పాఠశాలల్లో ఎన్నికలు నిర్వహించారు. దాదాపు అన్ని పాఠశాలలో ఏకగ్రీవంగా ఎన్నికలు నిర్వహించగా మోగల్లు, గొరగనమూడి ఉన్నత పాఠశాలలో చైర్మన్ పదవులకు తీవ్ర పోటీ నెలకొంది.

కాళ్ల: పాఠశాల యాజమాన్య కమిటీ ఎన్నికలు గురువారం మండలంలోని అన్ని పాఠశాలల్లో ప్రశాంతంగా నిర్వహించారు. కాళ్ల మండలంలోని 9 హైస్కూల్స్, రెండు యూపీ స్కూల్స్, 47 ప్రైమరీ స్కూల్స్‌లో పాఠశాల యాజమాన్య కమిటీ చైర్మన్లు, వైస్ చైర్మన్లతో పాటు సభ్యులు ఏకగ్రీవంగా ఎన్నుకోబడ్డారని విద్యాశాఖ అధికారులు తెలిపారు. ఈ సందర్భంగా పలువురు నాయకులు మాట్లాడుతూ నూతనంగా ఎన్నిక కాబడ్డ యాజమాన్య కమిటీలు పాఠశాలల అభివృద్ధికి కృషి చేయాలని తెలిపారు. సర్పంచులు, ఎంపీటీసీలు, వార్డ్ మెంబర్లు, నాయకులు, పాఠశాల ఉపాధ్యాయులు, విద్యార్థుల తల్లిదండ్రులు పాల్గొన్నారు.

ప్రశాంతగా ఎస్ఎంసీ ఎన్నికలు

భీమవరం అర్బన్: మండలంలో హై స్కూల్స్, ప్రాథమిక పాఠశాలల్లో గురవారం ప్రశాంత వాతావరణంలో స్కూల్ మేనేజ్‌మెంట్ ఎన్నికలు నిర్వహించారు. మండలంలోని దొంగపిండి, గూట్లపాడు, గొల్లవానితిప్ప, దిరుసుమర్రు, చినఅమిరం, వెంప, బేతపూడి, తుందుర్రు, నాగేంద్రపురం తదితర గ్రామాల్లో 12 జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలు, 64 ప్రాథమిక పాఠశాలలు ఉన్నాయి. ప్రధానోపాధ్యాయులు సమక్షంలో విద్యార్థుల తల్లిదండ్రులు, సంరక్షకులు స్కూల్ మేనేజ్‌మెంట్ కమిటీ చైర్మన్, వైఎస్ చైర్మన్, సభ్యులను ఎన్నుకున్నారు. అనంతరం కమిటీ సభ్యులచే ప్రధానోపాధ్యాయులు ప్రమాణ స్వీకారం చేయించారు. ఈ కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయులు, విద్యార్థుల తల్లిదండ్రులు తదితరులు పాల్గొన్నారు.

పాఠశాల అభివృద్ధికి కృషి చేయాలి

భీమవరం: పట్టణంలోని పొట్టిశ్రీరాములు(పీఎస్ఎమ్) మునిసిపల్ గరల్స్ హైస్కూల్ విద్యాకమిటీ చైర్‌పర్సన్‌గా కె విజయలక్ష్మి ఎన్నికయ్యారు. గురువారం స్కూల్లో నిర్వహించిన ఎన్నికల్లో 15 మంది సభ్యులను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. అనంతరం ప్రధానోపాధ్యాయులు మాట్లాడుతూ పాఠశాల అభివృద్ధికి కృషి చేయాలన్నారు. స్కూల్ హెచ్ఎం వారణాసి రాధాకృష్ణ చెప్పారు.



పాలకోడేరు: మోగల్లు ప్రభుత్వ పాఠశాలలో మాట్లాడుతున్న చైర్మన్ సుబ్రహ్మణ్యం



భీమవరం: పీఎస్ఎమ్ విద్యాకమిటీ సభ్యులు



భీమవరం అర్బన్: దిరుసుమర్రు హైస్కూల్లో ప్రమాణ స్వీకారం చేస్తున్న కమిటీ సభ్యులు